

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

26 ఆగస్టు 2025 పేజీలు : 08

మంగళవారం




### పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో
## పరిష్కరించాలి

**కలెక్టర్ ఆనంద్ - ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 486అర్జీలు**

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్‌వో హుస్సేన్ సాహెబ్, జడ్పీ సిఇవో మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార విషయంలో సంబంధిత శాఖలు అలసత్వం వహించ కూడదని తెలిపారు. ఎప్పటికప్పుడు -మిగతా 2లో

### సింగిల్‌విండో విధానంతో గణేష్ ఉత్సవాల
## అనుమతులు సులభతరం

**జిల్లా ఎస్పీ కృష్ణకాంత్**



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

వినాయక ఉత్సవాలకు సంబంధించిన అన్ని రకాల అనుమతులను మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందుబాటులోకి సింగల్ విండో విధానాన్ని తీసుకొచ్చిందని ప్రజలు యొక్క అవకాశాన్ని విని యోగించుకోవాలని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ సోమవారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రజలు అగ్ని మాపక శాఖ, పురపాలక శాఖ, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖల నుంచి నిరభ్యంతర (ఎన్ఓసి) పత్రం తీసుకోవాల్సి ఉండేద ని, దీని కోసం ప్రజలు ఆయా శాఖల చుట్టూ తిరగవలసి వచ్చేదని కానీ ప్రజల వెసులుబాటు కొరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ సింగిల్ విండో క్లియరెన్స్ విధానం రూపొందించిందని ఆయన తెలిపారు. జిల్లాలో గణేష్ ఉత్సవాలను నిర్వహించదలచినవారు ఈ సింగిల్ విండో విధానంలో https://ganeshutsav.net అనే వెబ్సైట్లో వివరాలను పూర్తి చేసి మీ సేవలో చలానా రుసుము చెల్లించి అనుమతులు పొందాలని, అనుమతులను క్యూఆర్ కోడ్‌ను లామినేషన్ను చేసి ఉత్సవాలను నిర్వహించే పందిరిలో తనిఖీలకు వచ్చే అధికారులకు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ యొక్క అప్లికేషన్ స్టేటస్‌లో గణేష్ మండపం ఏర్పాటు చేయదలచిన కమిటీ సభ్యుల వివరాలు, మండలం ఏర్పాటు చేయు ప్రదేశం, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ఠ ఏ రోజు జరుగుతుంది, నిమజ్జనం ఎక్కడ ఏ సమయంలో చేస్తారు, ఏ వాహనం ద్వారా నిమజ్జనం చేస్తారు వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని ఈ యొక్క దరఖాస్తు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్హెచ్ఓకి వెళుతుందని, అనంతరం ఆ యొక్క ఎస్‌హెచ్ఓ ఆధ్వర్యంలో పురపాలక శాఖ, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖల యొక్క సిబ్బంది ఒక బృందంగా ఏర్పడి మండపం ఏర్పాటు చేయు ప్రదేశాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించి స్థానికులంగా ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రం జారీ చేస్తారని, -మిగతా 2లో

### ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన
## విజిలెన్స్ అధికారులు



వివరాలు 2లో

ఆత్మకూరు పట్టణంలో ఎరువుల దుకాణా లను సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. **– ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

### కోటంరెడ్డి సోదరులను కలిసిన
## ఏఎంసీ డైరెక్టర్ మార్కెట్ సురేష్




**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తదితరులతో సోమవారం సాయంత్రం ఏఎంసి డైరెక్టర్‌గా నియమితులైన మార్కెట్ సురేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. ఏఎంసీ డైరెక్టర్‌గా తనకు అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జమీర్, చిత్తలూరు సుందర్ రామిరెడ్డి, శేఖర్‌రెడ్డి కృష్ణారెడ్డి, శ్రీపతిరాము, కాకు మురళి, మార్కెట్ నవీన్, నాగరాజా, షాన్వాజ్ పాల్గొన్నారు.

### ఘనంగా పీఏసీఎస్ పాలకవర్గ
## ప్రమాణ స్వీకారం

**ముఖ్యఅతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి**

8లో



## ఆత్మకూరులో వాడవాడలా, గ్రామ గ్రామాన

# స్మార్ట్‌కార్డుల పంపిణీ





**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపాలిటీలో, మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం అధికారులు, ప్రజా ప్రతినిధులు, తెలుగుదేశం నాయకులు ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను ముమ్మరంగా పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన స్మార్ట్ కార్డులను రూపొందించగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు, రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సూచనలతో ఈ కార్యక్రమాన్ని ఆత్మకూరులో ముమ్మరంగా చేపట్టారు. గతంలో కార్డులు ఉన్నవారికి, నూతనంగా మంజూరైన వారికి ఈస్మార్ట్ కార్డులను బహుళ ప్రయోజనకరంగా ఉండేలా ప్రభుత్వం రూపొందించింది. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావని, తహశిల్దారు పి.పద్మజాకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారం వెంకటరమణమ్మ, వైస్ చైర్మెన్ షేక్ సర్దార్, కౌన్సిలర్లు గౌస్‌బాషా, సూరా భాస్కరరెడ్డి, పొడమేకల పెంచలయ్య యాదవ్, గంధళ్ళ వేణు, తెలుగుదేశం నాయకులు పులిమి శైలజారెడ్డి, పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, కొప్పోలు చిన్నపురెడ్డి, తోడేటి వెంకటయ్య, నాగులూరు చిన్నబ్బయ్య, దాసరి మధుసూధనరావు, కాపా వెంకటసుబ్బయ్య, తదితరులు ఇంటింటికెళ్ళి ప్రజలకు స్మార్ట్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు స్థానిక ఆర్డీవో భూమిరెడ్డి పావని, తహశిల్దారు పి.పద్మజాకుమారిలను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.

**గ్రామాల్లో ముమ్మరంగా పంపిణీ :**

మున్సిపల్ పరిధిలోని పేరారెడ్డిపల్లిలో కౌన్సిలర్ మాదాల శ్రీనివాసులు నాయుడు, కమీషనర్ సి.గంగాప్రసాద్ తదితరులు కార్డులను పంపిణీ చేశారు. మండలంలోని చెర్లోయడవల్లిలో తెలుగుదేశం సీనియర్ నాయకుడు కేతా విజయభాస్కరెడ్డి ఆధ్వర్యంలో కార్డులను పంపిణీ చేయగా సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. వాసిలిలో మండల తెలుగుదేశం అధ్యక్షుడు సుంకరపెంచలచౌదరి ఆధ్వర్యంలో కార్డులు పంపిణీ చేయగా సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. కరటంపాడులో రాష్ట్ర తెలుగుదేశం నాయకులు దావా పెంచలరావు, సర్పంచ్ పూనుగుంట రేవతి, సచివాలయ సిబ్బంది కార్డులను పంపిణీ చేయగా వీఆర్వో చిన్నమ్మ, టిడిపి నాయకులు హనీఫ్, నజీర్, కె.చెన్నయ్య, రఘురామయ్య, వీరదాసు పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని మహిమలూరులో తెలుగుదేశం నాయకులు వల్లూరు వెంకటరమణారెడ్డి, మద్దినేని నారాయణ, సచివాలయ సిబ్బంది, బసవరాజుపాళెంలో మండల తెలుగుమహిళ అధ్యక్షురాలు కొప్పోలు రమణమ్మ తదితరు లు స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. అన్నిగ్రామాల్లో ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం నాయకులు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు తదితరులు కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్డులు ప్రజలకు బహుళ ప్రయోజనకరంగా ఉండేలా ప్రభుత్వం రూపొందించిందని వారు ప్రజలకు వివరించారు.









## ఘనంగా భగవాన్ వెంకయ్యస్వామి

# ఆరాధనోత్సవం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపై నెల్లూరుపాళెం వద్ద ఉన్న శ్రీశ్రీశ్రీ భగవాన్ వెంకయ్యస్వామి ఆలయంలో ఆదివారం 17వ ఆరాధనోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధి చెరుకూరు శ్రీహరి నాయుడు ఆధ్వర్యంలో ఈ ఆరాధనోత్సవాన్ని అత్యంత వైభవోపేతంగా భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతం, 8 గంటలకు స్వామివారికి అభిషేకం, పూజలు శ్రీ మారుతీ కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 2కు భజన కార్యక్రమాలు, 3 గంటలకు స్వామివారి గ్రామోత్సవం, రాత్రి 9 గంటలకు పల్లకిసేవ కార్యక్ర మాలు నిర్వహించగా మధ్యాహ్నం, రాత్రి అన్నదాన కార్యక్రమాన్ని దివంగత పోలవరపు సుబ్బానాయుడు జ్ఞాపకార్థం ఆయన సతీమణి సుబ్బరత్నమ్మ, కుమారులు శివాజి, శ్రీనివాసులు, కోడలు హిమజశ్రీల ఆధ్వర్యంలో నిర్వహించారు. రాత్రి 10 గంటలకు నెల్లూరుపాళెం, పేరారెడ్డిపల్లి భజన బృందంచే పండరి భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని స్వామివారిని సందర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

*(మొదటి పేజీ తరువాయి)*

ఆడిట్ నిర్వహించాలని అదేవిధంగా వివరాలను ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. సమస్యల పరిష్కార విషయంలో అలసత్వం వహించిన శాఖలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 426 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించి 166, మున్సిపల్‌శాఖకు సంబంధించి 41, సర్వేకు 46, పంచాయతీ రాజ్‌శాఖకు 66, పోలీసుశాఖకు 67, సెర్ఫ్ శాఖకు సంబంధించి 12అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారులకు ఉచిత భోజన సదుపాయం ఏర్పాటు చేయడంతో పాటు వైద్యరోగ్య శాఖ మెడికల్ క్యాంపు నిర్వహించింది. కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# సింగిల్‌విండో విధానంతో గణేష్ ఉత్సవాల అనుమతులు సులభతరం

*(మొదటి పేజీ తరువాయి)*

తర్వాత ఎస్‌హెచ్‌ఓ వాటిని పరిశీలించి వెంటనే నిరభ్యంతర (ఎన్‌ఓసి) పత్రమును జారీ చేస్తారని నిర్వాహకులు ఆ యొక్క ఎన్‌ఓసిని డౌన్లోడ్ చేసుకుని మరియు పాటించవలసిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్‌ను లామినేషన్ చేసి ఉత్సవ మండపంలో తనిఖీలు చేపట్టేందుకు వచ్చి అధికారులకు అందుబాటులో ఉంచాలని ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఎస్పీ వివరించారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన

# విజిలెన్స్ అధికారులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో ఎరువుల దుకాణాలను సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ మరియు వ్యవసాయ శాఖలు సంయుక్తంగా ఆకస్మికంగా ఈ తనిఖీలు నిర్వహించారు. ఎరువుల నిల్వలు, స్టాక్‌రిజిస్టర్లు, బిల్లుపుస్తకాలు, తదితరాలను అధికారులు నిశితంగా పరిశీలించారు. 44.186 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వల రికార్డులు సక్రమంగా లేనివిగా గుర్తించారు. తాత్కాలికంగా అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ ఎరువుల విలువ 11లక్షల 14వేల 946 రూపా యలుగా నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ తహసిల్దారు జి.ఎస్.కృష్ణప్రసాద్, ఆత్మకూరు, ఉదయగిరి ఏడిఏలు జి.లక్ష్మి, మాధవి, స్థానిక మండల వ్యవసాయాధికారి కె.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఎరువుల అమ్మకాలు సక్రమంగా నిర్వహించాలని, రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు కఠినంగా ఉంటాయని వారు డీలర్లను హెచ్చరించారు.

# ఉపాధిహామీ పనులకు బడ్జెట్లో నిధులను పెంచాలి : సీపీఎం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని పొట్టే పాలెం గ్రామం నందు నెల్లూరు రూరల్ మండలం 4వ మహాసభ వనం రామచంద్రయ్య అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ మహాసభలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జే.వెంకమరాజు, మంగళ పుల్లయ్యలు మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లాలో పీడిత ప్రజల ప్రియతమ నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వ్యవసాయ కార్మిక సంఘాన్ని జిల్లాలో స్థాపించారనీ నేడు 1 కోటి 80 లక్షల సభ్యత్వంతో ప్రముఖ స్థానంలో ఉందని, నేడు వ్యవసాయంలో అనేక మార్పులు వచ్చాయని వ్యవసాయ కార్మికులకు పని దినాలు తగ్గిపోయాయని దీనితో భవన నిర్మాణ కార్మిక పనులకు వెళుతున్నారని ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు ఉపాధి హామీ పనులకు బడ్జెట్లో రెండు లక్షల కోట్ల రూపాయల నిధులను కేటాయించాల్సి ఉంటే కేవలం 83వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించారని దీనితో పనులు లేక వలసలు పోయే ప్రమాదం ఏర్పడిందని అన్నారు. వెంటనే ఉపాధిహామీ పనులకు బడ్జెట్లో నిధులను పెంచి వ్యవసాయ కార్మికులకు 200 పని దినాలు కల్పించి 600 వేతనం ఇవ్వాలని అన్నారు. ఈ నెల 28 వ తేది విద్యుత్ పోరాట అమరవీరుల ప్రతిజ్ఞ దినాన్ని, అక్టోబర్ 5వ తేదీ యల్లయపాలెంలో జరుగుతున్న జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని అన్నారు. మహాసభ అనంతరం 11మందితో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. అధ్యక్ష కార్యదర్శులుగా శ్రీపతి వెంకయ్య,పాదర్తి మస్తానయ్యలను కమిటీ సభ్యులుగా ముత్యాల నాగయ్య, భూలోకం సుధాకర్, అచ్చి అనంతయ్య,పోలేపల్లి పెంచలయ్య, పోలయ్య మరిమేసి కామాక్షయ్య, బిరుదోలు వేణు, గుంటి నాగరాజు మబ్బు పుల్లయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో సీఐటీయు నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరి తిరుపా లు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్లాడి గోపాల్, రైతు సంఘం నాయకులు పూడిపర్తి జనార్ధన్, కౌలు రైతు సంఘం నాయకులు ఎడవల్లి రమణయ్య విరువూరి వెంకటరమణయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వనం రామచంద్రయ్య, పల్లవరపు సుబ్రహ్మణ్యం, దువ్వూరు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# కంపసముద్రంలో నూతన సజ్జ రకంపై క్షేత్ర దినోత్సవం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు సమన్వయకర్త డా. జి.లలిత శివజ్యోతి ఆధ్వర్యంలో మండలంలోని కంపసముద్రంలో సోమవారం నూతన సజ్జరకం ఏబీవీ-04పై క్షేత్ర దినోత్సవం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జి.లలిత శివజ్యోతి మాట్లాడుతూ.. చిరుధాన్యాలు, భవిష్యత్ తరాల ఆరోగ్యానికి బలమైన ఆహార వనరులని. ఏబీవీ-04 సజ్జ రకం తక్కువ కాలంలో అధిక దిగుబడి ఇస్తూ, వెర్రికంకి తెగులు, బెట్టను, అగ్గి తెగులును, గింజ కాటుక వంటి ముఖ్య తెగుళ్లను తట్టుకుంటుందని, ఇది రైతులకు ఆదాయపరంగా, వినియోగదారులకు పోషకాహార పరంగా ప్రయోజనకరమైన రకమన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, నెల్లూరు శాస్త్రవేత్త డా. కె.కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ రకం పంట కాలం 85-90 రోజులని, ఎకరాకు 10-12 క్వింటాళ్ల వరకు దిగుబడి రావడం రైతులకు ఆర్థికపరంగా లాభదాయకమని, అంతేకాకుండా, గింజలలో ఇనుము, జింకు అధికంగా ఉండటం వల్ల పోషక విలువలతో కూడిన ఆహారాన్ని సమకూర్చుతుందని వివరించారు. ఉదయగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు జి.లక్ష్మి మాధవి మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగు వల్ల భూమి యొక్క ఆరోగ్యం మెరుగవుతుందని. తక్కువ నీరు, తక్కువ ఎరువులు, పురుగు, తెగుళ్ళ మందుల వాడకంతో, ఎక్కువ ఆదాయం ఇచ్చే పంటలలో సజ్జకు ప్రత్యేక స్థానం ఉందని. ఏబీవీ-04 రకం రైతులకు స్థిరమైన ఆదాయాన్ని అందించగలదన్నారు. మర్రిపాడు మండల వ్యవసాయ అధికారి ఎన్.కవిత మాట్లాడుతూ.. రైతులు ఈ రకాన్ని స్వీకరించి విస్తృతంగా సాగు చేస్తే, స్థానిక అవసరాలకు సరిపడటమే కాకుండా, మార్కెట్లో కూడా మంచి డిమాండ్ పొందవచ్చని పేర్కొన్నారు. దుత్తలూరు మండల వ్యవసాయ అధికారి సి.హెచ్. మదన్ మోహన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం కూడా చిరుధాన్యాల వినియోగాన్ని పెంచేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని. అలాంటి పరిస్థితుల్లో ఏబీవీ-04 వంటి రకాలు రైతులకు మంచి అవకాశాలు కల్పిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతులు ఏబీవీ-04 సజ్జ రకాన్ని పరిశీలించి ఒక మొక్కకు 2-8 కంకులు రావడం, తెగుళ్లపై తట్టుకునే శక్తి ఉండటం, తక్కువ కాలంలో దిగుబడి ఇవ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మాకు లాభదాయకమైన కొత్త రకం దొరికిందని, రాబోయే ఋతువులలో విస్తృతంగా సాగు చేస్తాని తెలిపారు.

# గంజాయి అమ్ముతున్న వ్యక్తులు అరెస్ట్

- 6 కేజీల గంజాయి, రూ.22వేల నగదు, ఒక అప్పి ఆటో స్వాధీనం
- గతంలో ముద్దాయిలు ఎ1, ఎ2లపై పిడి యాక్ట్, పలు గంజాయి కేసులు
- ముద్దాయిలను చాకచక్యంగా పట్టుకున్న సంత పేట పోలీసులు
- జిల్లా ఎస్పీ, టౌన్ డీఎస్పీలు అభినందనలు



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని సంతపేట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తున్న నలుగురు ముద్దాయిలను ఆదివారం అరెస్ట్ చేసినట్లు సంతపేట పోలీస్ స్టేషన్ సిఐ దశరథ రామారావు సోమవారం విలేకరులకు సమావేశంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెడు వ్యసనాలకు అలవాటు పడి సులభ పద్ధతిలో డబ్బు సంపాదించాలని గంజాయిని వైజాగ్ నుంచి కేజీ 10వేలు చొప్పున కొనుగోలు చేసి వాటిని 10 గ్రాముల చొప్పున చిన్న ప్యాకెట్లు చేసి ఒక్కొక్కటి మూడు వందల రూపాయలు వంతున కేజీకి 30వేల రూపాయలకు అమ్ముతూ చెడు సంపాదనకు ముద్దాయిలు అలవాటుపడ్డారని ఈ క్రమంలో పక్కాగా అందుకున్న సమాచారం ప్రకారం ఆదివారం ముద్దాయిలు షేక్ సుభాని భర్త సిరాజ్ (36), కాపాడిపాలెం షేక్ సిరాజ్ (42) కాపాడిపాలెం, కొండ్ర జ్యోతి (45) కపాడిపాలెం, షేక్ మీరా (39) కల్తీ కాలనీ కోడూరుపాడు అను ముద్దాయిలు రాయపు వీధి కపాడిపాలెం నందు గంజాయి విక్రయిస్తుండగా ముద్దాయిలను అరెస్టు చేసినట్లు మధ్యవర్తులు ఎమ్మార్వో సమక్షంలో వారి దగ్గర నుంచి 6.350 కేజీల గంజాయిని, 22500/-రూపాయల నగదును, ఏపీ 26 టిఈ 9796 అను నెంబర్ గల అప్పి ఆటోను స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం సోమవారం కోర్టుకు హాజరు పరిచినట్లు సీఐ తెలియజేశారు. అదేవిధంగా తమ స్టేషన్ పరిధిలోని ఎవరైనా ప్రజలను నాశనం చేసే విధంగా ఈ యొక్క గంజాయిని అమ్ముతున్న లేక ఎవరైనా కొనుగోలు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని సంతపేట పోలీస్ స్టేషన్ సిఐ జి.దశరథ రామారావు ఘాటుగా హెచ్చరించారు. ముద్దాయిలను చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకుని ప్రతిభ కనబరిచిన సంతపేట పోలీస్ స్టేషన్ సిఐ జి.దశరథ రామారావు, ఎస్ఐ జి.బాలకృష్ణ, ఏఎస్ఐ జి.శ్రీహరి, హెడ్ కానిస్టేబుల్ జి.సుబ్బారావు, పిసి ఎస్కే అల్లాబక్షు, ఎస్ సురేంద్రబాబు, జి.గోపి, ఉమెన్ పిసి పి కుమారి, పి.అనూష, వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, టౌన్ డిఎస్పి సింధు ప్రియా ప్రత్యేకంగా అభినందించారు.


## కళాశాలలో స్టూడెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రాం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కడనూతుల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం స్టూడెంట్స్ ఓరెంటేషన్ ప్రోగ్రాంను మొదటి సంవత్సరం బిటెక్ విద్యార్థిని విద్యార్థుల కొరకు ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రముఖ సాఫ్ట్వేర్ ఫుల్ స్టాగ్ డెవలపర్ అయిన పి.సాయి ధీరజ్, అడ్వకేట్ శ్రీ సాయి ప్రసాద్‌లు పాల్గొని ఇంజనీరింగ్ విద్య యొక్క ప్రాముఖ్యత, విద్యార్థులు ఇంజనీరింగ్ విద్యలో పాటించాల్సిన నియమనిబంధనలు తదితర విషయాలను విద్యార్థిని విద్యార్థులకు తెలియజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆర్‌వి రమణారెడ్డి, హెచ్ అండ్ ఎస్ అధిపతి డాక్టర్ కే.లక్ష్మి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాప్య పెన్షన్ పథకాన్ని అమలు చేయాలి

● రాష్ట్ర ప్రభుత్వానికి బీజేపీ నేత మిడతల రమేష్ విజ్ఞప్తి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ఈపీఎఫ్ పెన్షన్ దారులకు వృద్ధాప్య పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి బిజెపి నేత మిడతల రమేష్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో పదివేల రిటైర్డ్ ఉద్యోగులు ఈపీఎఫ్ కింద చాలా తక్కువ మొత్తంలో(1000/2000/3000) నెలనెలా పెన్షన్ తీసుకుంటున్నారు. ఈ పెన్షన్(1000/2000/3000) మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కిచ్చే పెన్షన్ పథకాల కంటే కంటే తక్కువగా ఉంది. ఉదాహరణకు ఒక ఉద్యోగి కొన్ని సంవత్సరాలు ప్రభుత్వానికి సేవలందించి చాలీచాలని పెన్షన్ (1000/2000/3000)తో, ఉన్న ఊరిలో గౌరవంగా బతకలేక, కుటుంబాన్ని పోషించుకోలేక ఉన్న వూరువదిలి వేరేవురిలో దినసరి కూలీగా జీవనం గడుపుతున్నారు. ఈపీఎఫ్ నుండి తక్కువ పెన్షన్ వస్తున్నందున వీరికి ప్రభుత్వ పథకాలు అమలు కావు. వాస్తవ జీవితంలో ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. కష్టపడి పని చేద్దాం అనుకున్న వయోభారంతో చేయలేకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి ఈపీఎఫ్ రిటైర్డ్ ఉద్యోగుల మనోవేదనను గుర్తించి, వారికి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చే పెన్షన్ ను వీరికి కూడా మంజూరు చేయాలని రమేష్ విజ్ఞప్తి చేశారు.

### వినాయక విగ్రహాల ఏర్పాటుకు

## అనుమతులు తప్పనిసరి : ఎస్ఐ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉత్సవాలను జరుపుకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ మహమ్మద్ హనీఫ్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానంలో ఆన్లైన్లో అనుమతులు పొందవచ్చన్నారు. పోలీసు వారు ఇచ్చే క్యూఆర్ కోడ్‌ను మండపాల వద్ద ప్రదర్శించాలని సూచించారు. ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఆయా మండపాల వద్ద ఏర్పాటు చేసిన విగ్రహాలు, నిర్వాహకుల సమాచారం అందులో ఉంటుందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సహాలతో జరుపుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు చేసుకున్నా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీజేలు, లౌడ్ స్పీకర్లు, అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవని తెలియజేశారు. నిర్వాహకులు పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించి పోలీస్ సిబ్బందికి సహకరించాలని తెలియజేశారు.


# ప్రణీత్ ఆథరైజ్డ్ టెస్టింగ్ సెంటర్ ప్రారంభోత్సవం

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు ముత్తుకూరు రోడ్డు మార్గంలో కప్పల దొరువు వద్ద ప్రణీత్ ఆథరైజ్డ్ టెస్టింగ్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ విభాగాన్ని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన సెంటర్ అధినేత చిల్లకూరు రవీంద్ర రెడ్డితో కలిసి ప్రారంభం చేశారు. వీరి వెంట భాజపా జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి, స్థానిక బిజెపి నాయకులు కే రవీంద్ర రెడ్డి ఉన్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డికి ఘన స్వాగతం పలికారు. ముత్తుకూరు, తోటపల్లి గూడూరు మండలాల టిడిపి అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, సన్నారెడ్డి సురేష్ రెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు వేళ్ళపాశెం సంపత్ రెడ్డి, కూటమి పార్టీల నాయకులు హాజరయ్యారు. ప్రారంభోత్సవం అనంతరం ఎమ్మెల్యే సోమిరెడ్డి మీడియాతో మాట్లాడారు. జిల్లా స్థాయిలో అన్ని వ్యాపార వాహనాల సామర్థ్యాన్ని టెస్టింగ్ చేసే సెంటర్ సర్వేపల్లి నియోజకవర్గం ముత్తుకూరు మండలంలో ఏర్పాటు కావడం ప్రశంసనీయమన్నారు. ఫిట్ నెస్ ప్రక్రియలో వస్తున్న లోపాల కారణంగా సామర్థ్యంలేని వాహనాలు కూడా ఎఫ్‌సీ పొంది ప్రమాదాలకు కారణం అవుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ లోపాలను అరికడుతూ పక్కా పారదర్శకంగా ఎఫ్‌సీల జారీకి అత్యాధునిక వ్యవస్థను అందుబాటులోకి



తీసుకొచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నూతన విధానంలో వాహనాలకు 30 రకాల పరీక్షలు నిర్వహించి ఫిట్ నెస్ సర్టిఫికెట్ జారీ చేసే అవకాశం ఉందన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీల పాలనలో ఉన్న అన్ని రాష్ట్రాల్లో ఈ అత్యాధునిక వ్యవస్థ అమలులోకి వచ్చినట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలిపారు. నూతనంగా ప్రారంభం చేసుకున్న ఈ సెంటర్ విజయవంతం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ ప్రభుత్వం చేసిన మోసలను ప్రజలకు వివరించాలి




## 4వ డివిజన్‌లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో విడుదల : ఎమ్మెల్సీ పర్వత వెల్లడి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో అధికారం లోకి వచ్చిన టిడిపి ప్రభుత్వంపై రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్సీ వైసీపీ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం నెల్లూరు నగరంలోని 4వ డివిజన్ జాకీర్ హుస్సేన్ నగర్‌లో డివిజన్ స్థాయి రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమానికి వైస్సార్సీపీ కార్యకర్తలు, నాయకులు సమక్షంలో ఇన్‌చార్జ్ సందాని, కో ఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి ధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి హాజరై రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ప్రజలకు చేసిన మోసాలను పలువురు నేతలు ప్రజలకు వివరించారు. చంద్రబాబు ప్రజలకు మోసపు హామీలు ఇచ్చి ఈరోజు ప్రజలను నట్టేట ముంచారని అన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక హామీలపై ప్రశ్నిస్తున్న వైఎస్ఆర్సిపి నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీ రెడ్‌బుక్ పాలన సాగిస్తూ వైఎస్ఆర్ సీపీ నేతలపై అక్రమ అరెస్టులకు పాల్పడుతూ దుర్మార్గపు పాలన సాగిస్తుందన్నారు. పోలీసులు కూటమి ప్రభుత్వానికి తొత్తులుగా మారి తెలుగుదేశం పార్టీ చెప్పిన వారిపై చెప్పిన విధంగా అక్రమ కేసులు బనాయిస్తూ లా అండ్ ఆర్డర్‌ను పహస్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలందరూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలుస్తూ కూటమి ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి తప్పు చేశామన్న భావన ప్రజలందరిలో ఉందని మరోసారి ఈ రాష్ట్రానికి జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ పెర్నెటి కోటేశ్వర రెడ్డి, 3వ డివిజన్ ఇన్‌చార్జ్ నారాయణరెడ్డి, 5వ డివిజన్ ఇన్‌చార్జ్ సుబ్బారెడ్డి, 5వ డివిజన్ కోఆర్డినేటర్ ఇబ్రహీం, డివిజన్ నాయకులు సుభాహని, జీలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

# హెూల్ సేల్, రిటైల్ ఎరువుల దుకాణాలు తనిఖీ

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** జిల్లా కలెక్టర్, సంయుక్త జాయింట్ కలెక్టర్ ఆదేశముల ప్రకారము జిల్లాలోని ఎరువులు షాపులను తనిఖీచేయు నిమిత్తము బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. నెల్లూరు ఏడిఏ సబ్ డివిజన్ పరిధిలోని హెూల్ సేల్, రిటైల్ ఎరువుల దుకాణాలను తనిఖీ బృందం తనిఖీ చేయటం జరిగింది. ఏపీ మార్క్ఫెడ్ వారికి సంబంధించి స్టాక్ రిపోర్టు స్టాక్ బోర్డు, స్టాకు రిజిస్టరు సరైన విధముగా నిర్వహించటం లేదు కాబట్టి ఎఫ్‌సిఓ 1985 క్లాస్ 4, క్లాస్ 35 అతిక్రమణన్ని గుర్తించి వారికి షోకాజు నోటీసు జారీ చేయవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు. సాయి వసుధ ఎరువుల దుకాణం నందు అదీకృత పత్రాలు లేని సరుకు దుకాణం నందు గుర్తించి నాలుగు లక్షల నాలుగు వేల రూపాయల సరుకును అమ్మకంను నిలిపివేయడం జరిగింది. అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారి ఆదేశాల అనుగుణంగా ఎవరైనా దుకాణదారులు ఎరువుల యొక్క నిర్వహణ విషయంలో ఎటువంటి అతిక్రమణాలకి పాల్పడిన వారి యొక్క దుకాణ లైసెన్సులను సస్పెండ్ చేయటం, నిత్యావసర సరుకుల చట్టం అతిక్రమణాన్ని పరిగణలోకి తీసుకొని ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం కఠిన చర్యలు చేపట్టబడునని తనిఖీ బృందం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో




నెల్లూరు భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ కన్నయ్య, మండల వ్యవసాయ అధికారి ఎస్‌వి నాగమోహన్ పాల్గొన్నారు.



## వేమారెడ్డిని నెల్లూరు జైల్లో కలిసిన ఎమ్మెల్సీలు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** ఒక అక్రమ కేసులో అరెస్ట్ అయి నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న గూడూరు వైఎస్ఆర్సిపి నాయకులు, చిల్లకూరు మండల ఉపాధ్యక్షులు వేమారెడ్డి కుమారస్వామి రెడ్డి తో సోమవారం ఎమ్మెల్సీలు మేరుగ మురళి, పర్వత్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మూలాఖత్ అయ్యారు. ఈ సందర్భంగా కుమారస్వామి రెడ్డితో వారు పలు విషయాలు చర్చించారు. అక్రమ కేసుల గురించి అధైర్యపడవద్దని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఘనంగా ఆనం విజయకుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని చింతా రెడ్డిపాలెం నందు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి జన్మదిన సందర్భంగా వారి నివాసంలో భారీగా తరలివచ్చిన అభిమానులు, నాయకులు, కార్యకర్తలు కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆనం విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. తన పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమా నులకు పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గం పంచాయతీ రాజ్ విభాగ అధ్యక్షుడు బండ్ల రాజేంద్రప్రసాద్, వైసిపి రూరల్ మండల ముస్లిం వింగ్ ఉపాధ్యక్షుడు షైక్ కరీం బాషా, వైసిపి నెల్లూరు రూరల్ మండలం కార్యవర్గ సభ్యుడు తుమ్మల కిరణ్ కుమార్ రెడ్డి, సౌత్ మోపూర్ గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఆనంకి జన్మదిన శుభాకాంక్షలు : ఎమ్మెల్సీ



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు చింతా రెడ్డిపాలెంలో నెల్లూరు రూరల్ ఇన్‌చార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డిని నివాసంలో సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి సిటీ నేతలతో కలిసి విజయకుమార్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆనం విజయకుమార్‌రెడ్డి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు.

# శ్రీకాంత్ రెడ్డి బెయిల్ డిస్మిస్



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** అక్రమ మైనింగ్ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుకుంటూ పొదలకూరు పోలీసులు పెట్టిన కేసులోవైసీపీ నాయకుడు బిరదవోలు శ్రీకాంత్ రెడ్డి చేసుకున్న విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించింది ఈ మేరకు సోమవారం నాడు ఆయన పెట్టుకున్న బెయిల్ పిటిషన్ డిస్మిస్ చేసింది వివరాల్లోకి వెళితే అక్రమ మైనింగ్ వ్యవహారాలకు పాల్పడినాడనే ఆరోపణలతో పాటు గనులు, ఖనిజాల నియంత్రణ చట్టానికి భిన్నంగా ప్రవర్తించాడని పీడీపీపి చట్టాన్ని దుర్వినియోగం చేశాడని అలాగే ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలో కూడా ముద్దాయిగా పేర్కొంటూ పొదలకూరు పోలీసులు బిరుదవోలు శ్రీకాంత్ రెడ్డి పై పెట్టిన కేసులో శ్రీకాంత్ రెడ్డికి బెయిల్ డిస్మిస్ చేస్తూ ఐదవ అదనపు జిల్లా జడ్జి ఎన్.సరస్వతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు శ్రీకాంత్ రెడ్డి పలు అక్రమ మైనింగ్ వ్యవహారాలకు పాల్పడ్డాడని ఆరోపణల కేసు దర్యాప్తులో ఉన్నందున బెయిల్‌కు అర్హుడు కాదని పేర్కొంటూ న్యాయమూర్తి బెయిల్ డిస్మిస్ చేశారు. కాగా తనకు జైలు ఆహారం పడడం లేదని ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునే సదుపాయం కల్పించాలని అలాగే తనకు తరచూ గుండె నొప్పి వస్తున్నందున ప్రైవేటు ఆసుపత్రిలో చూపించుకునేందుకు అనుమతించాలని జైలు అధికారులను ఆదేశించాలని కోరుతూ చేసుకున్న విజ్ఞప్తిని న్యాయస్థానం పాక్షికంగా అంగీకరించింది ఆహారం గురించి రిమాండ్ సమయంలో ఎలాంటి విజ్ఞప్తి చేయనందువల్ల ప్రత్యేకించి ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునేందుకు న్యాయస్థానం అనుమతించలేదు అయితే గుండె నొప్పికి సంబంధించి వైద్య పరీక్షలను చేయించి అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చేందుకు అనుమతించింది ఈమేరకు జైలు అధికారులను ఆదేశిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు.

# ఎస్సీ వర్గీకరణ పేరుతో మాలలను తొక్కి వేయడమే లక్ష్యమా

## జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు రత్నాకర్ వెల్లడి




**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** దేశంలో మెజార్టీ వర్గమైన మాలలను ఎస్సీ వర్గీకరణ పేరుతో చీలిక పెట్టి వారిలో ఉన్న ఐక్యతను అన్ని రాజకీయ పార్టీలు దెబ్బతీస్తున్నాయని జాతీయ మాల మహానాడు అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితుల ఐక్యతపై ఎస్సీ వర్గీకరణ ముసుగులో బిజెపి, టీడీపీ భాగస్వామ్యంలో దళితుల ఐక్యతపై ప్రధానమంత్రి మోడీ దేశవ్యాప్తంగా కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. మోడీ ఓట్లు దొంగతనం బయటకు వస్తుందని నెపంతో, ముందు జాగ్రత్తగా, దేశంలో మెజార్టీ వర్గమైన దళిత వర్గాన్ని, వర్గీకరణ పేరుతో దెబ్బ కొట్టి డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపారని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులైన గురుశిష్యులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ఈ రాష్ట్రంలో సమస్యలే లేనట్లుగా ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని తీసుకొచ్చారని వివరించారు. ఎస్సీ వర్గీకరణ పై రాజకీయ పార్టీల్లో ఉన్న మాల ప్రజా ప్రతినిధులు నోరుమెదపకపోవడం, బాధాకరం అన్నారు. రిజర్వేషన్ పేరుతో ఎంగిలి మెతుకులు పడేసి, ఎస్సీ లిస్టులో ఉన్న కులాలన్నీ కూడా ఈ ఎంగిలి మెతుకుల్లో వాటాల కోసం కొట్టుకు చస్తూ వుండాలన్నదే ఈ రాజకీయ పార్టీలు ఎత్తుగడ అన్నారు. కేవలం రిజర్వేషన్ కోసమే దళితులు నిరంతరం ఆలోచిస్తూ, రాజ్యాధికారం వైపు కన్నెత్తి చూడకుండా ఉండాలన్నదే రాజకీయ పార్టీలు కుట్ర అన్నారు. దళితుల మేనమామ అయిన జగన్మోహన్ రెడ్డి, ఈ విషయంపై కనీసం ఇంతవరకు స్పందించక పోవడంపై పలు అనుమానలు రేకిత్తిస్తున్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణపై జగన్మోహన్ రెడ్డి స్టాండ్ ఏమిటో ఇంతవరకు చెప్పలేదు అన్నారు. వైసీపీ అంటే బట్టలు చింపుకొనే దళిత సోదరులు, మాల బంధువులు, ఇకనైనా ఆలోచించుకోవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాల సామాజిక వర్గ ఉనికి ఈ రాష్ట్రాల్లో, ప్రశ్నార్థకంగా మారిపోయిందని చెప్పారు. ఇకనైనా మాలలు కళ్ళు తెరిచి బాధ్యతను గుర్తెరిగి మాల సోదరులు, శాంతియుత, ప్రజాస్వామ్య పోరాటానికి సిద్ధం కావాలని పిలుపుచ్చారు. ఈ సమావేశంలో ఉలవపాటి శీ నయ్య, దాసరి చిట్టిబాబు, నెల్లి సూరిబాబు, నల్లి సునీల్ కుమార్, కలిమేలి పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలు జరపకుండా పర్యవేక్షించండి : కమిషనర్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో అనుమతులు లేకుండా చేపట్టిన అక్రమ నిర్మాణాలు, అనుమతులను మించి నిర్మించిన కట్టడాలను గుర్తించి తొలి దశలోనే నిర్మాణాలను అడ్డుకోవాలని, అక్రమ నిర్మాణాలు జరపకుండా నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ నందన్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం, ప్రభుత్వ స్థలాలలో నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని, అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని స్పష్టం చేశారు. రోడ్లను ఆక్రమిస్తూ వాహనాలకు అడ్డంకిగా ఏర్పాటు చేసుకున్న దుకాణాలను, ఆక్రమణలను అన్ని డివిజన్లలో తప్పనిసరిగా తొలగించి ట్రాఫిక్ నిర్వహణకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-6, హౌసింగ్-25, టౌన్ ప్లానింగ్-11, రెవెన్యూ-1, పబ్లిక్ హెల్త్-1, ఆప్కాస్-2, పెన్షన్-7, మొత్తం-53 ఫిర్యాదులను అందుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కనకాద్రి, సిటీ ప్లానర్ హిమబిందు, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ వాసు బాబు, ఇతర అన్ని విభాగాల అధికారులు, సూపరెంటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

# చివరి రోజు అనూహ్యంగా పెరిగిన పొగాకు ధరలు

- **డీసీపల్లిలో ముగిసిన కొనుగోళ్లు**
- **రూ.165 కోట్ల పొగాకు విక్రయం**

**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లు శనివారంతో ముగిశాయి. అయితే చివరి రోజున పొగాకు ధరలు అనూహ్యంగా పెరిగాయి. దీంతో రైతులు నివ్వెర పోయారు. కొనుగోలు ముగిసే రోజున వ్యాపారస్తులు ధరలు పెంచు కొనుగోలు చేయడం విడ్డూరంగా ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ఏడాది ప్రతి బేరనకు మూడు లక్షల రూపాయల పైన నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వేలం ప్రారంభం నుంచి ధరలు ఏమాత్రం పెరగకపోగా ఎక్కువ పొగాకు కొనుగోలుకు నోచుకోక వెనుతిరిగిందని రైతులు ఆవేదన వ్యక్తపరిచారు. కిలో గరిష్ట పొగాకు ధర 280 రూపాయలు ఉండగా చివరి రోజున 291 రూపాయలకు చేరి గరిష్టంగా నిలిచిందన్నారు. దీంతో రైతులు కొనుగోళ్ల ప్రారంభం నుంచి ఎంత మాత్రం నష్టపోయారు అనేది స్పష్టంగా అర్థం అవుతోంది.





దాదాపుగా 11 రూపాయలు వ్యత్యాసం ఉండడం పట్ల రైతులు నష్టపోక తప్పలేదు. ఏది ఏమైనాప్పటికీ అధికారికంగా కొనుగోళ్లు ముగిసేసరికి 165 కోట్ల రూపాయల పొగాకును వ్యాపారస్తులు కొనుగోలు చేశారు.

### రూ.165కోట్ల పొగాకు కొనుగోళ్లు..

జిల్లాలోని డీసీపల్లి పొగాకు వేలంకేంద్రంలో రూ.165 కోట్ల పొగాకు కొనుగోళ్ల విక్రయం జరిగింది. వేలం కేంద్రానికి రైతులు 80,584 పొగాకు బేళ్లను తీసుకురాగా వాటిలో 55,891 బేళ్లను వ్యాపారస్తులు కొనుగోలు చేశారు. వాటిలో వివిధ కారణాలవల్ల 23,506 పొగాకుబేళ్లు వెనుతిరిగాయని వేలం నిర్వహణ అధికారి రాజశేఖర్ తెలిపారు. వాటిలో నో సెల్ -4837, నోబిడ్- 14,463, ఆర్ఆర్- 1456, సి ఆర్- 2749, బిఆర్-1గా పరిగణించబడ్డాయి. అయితే వేలం ప్రారంభం నుంచి కొనుగోళ్లలో 20 కంపెనీల వ్యాపారస్తులు పాల్గొని రూ.165,61,64,176 కోట్ల రూపాయలు వెచ్చించి 70,28,669 లక్షల కేజీల పొగాకును కొనుగోలు చేశారు. కిలో గరిష్ట పొగాకు ధర 291 రూపాయలు పలుకగా కనిష్ట ధర 140 రూపాయలు పలికి సరాసరి మొత్తం మీద 235.63 రూపాయిలుగా నమోదు అయింది.

## మర్రిపాడులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుపరిపాలనలో భాగంగా రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాలతో ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు, మర్రిపాడు మండల తహసీల్దార్ అనిల్ కుమార్ టిడిపి మండల అధ్యక్షులు దేవరాల గంగాధర్ యాదవ్ మండల టీడీపీ మాజీ అధ్యక్షులు శాఖమూరి నారాయణ ఆధ్వర్యంలో మర్రిపాడు మండల కేంద్రం మర్రిపాడు పంచాయతీ 11వ షాప్ పరిధిలో సోమవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భీమవరం సొసైటీ ఛైర్మన్ యర్రమల చిన్నారెడ్డి, భీమవరం సొసైటీ వైస్ ఛైర్మన్ యలగాల వెంకటేశ్వర్లు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి భూమిరెడ్డి నారాయణరెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షులు గుర్రం నాగేశ్వర్ రావు, ఆరికట్ల పుల్లయ్య, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి శాఖాపురం సురేష్, మాలపాటి వెంకటేశ్వర్లు, జనసేన నాయకులు చిన్నా, మండల కార్యాలయ సిబ్బంది ఆర్ఐ సాయికిరణ్, మహిళా పోలీస్ సుప్రజ, డీలర్ రాజమ్మ టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఉదయగిరిని జిల్లా చేయాలని వినతి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు కొత్త జిల్లాల పేర్ల మార్పులు చేయడం సరిహద్దులు చేర్పులు మార్పులు చేయడానికి అధ్యయనం చేయడం కోసం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించడం జరిగింది. ఇందులో భాగంగా మంత్రివర్గ ఉప సంఘం ఏమైనా సూచనలు సలహాలు అర్జీలా రూపంలో ఇవ్వమని కోరడం జరిగింది. ఉదయగిరి జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల అమరావతిలో ఉన్న మంత్రివర్గ ఉపసంహాన్ని కలిసి ఉదయగిరి జిల్లా చేయాలని వినతి పత్రాన్ని సమర్పించడం జరిగింది. వెనుకబడిన అనాదిగా నిర్లక్ష్యానికి నిరాదరణకు గురైన ఉదయగిరి ప్రాంతాన్ని జిల్లా చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఈ ప్రాంతంలో ఉన్నటువంటి వివిధ రాజకీయ పార్టీల నాయకులు అందులో భాగంగా సోమవారం ఎంఆర్పిస్ ఆధ్వర్యంలో ఉదయగిరి మండల తాసిల్దార్ ని కలిసి ఉదయగిరి జిల్లా చేయాలని మంత్రి వర్గ ఉపసంఘానికి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలోబకీరు జాషువా, బెజవాడ బాలగు రవయ్య, ఇత్తడి రమణ, పెంచలయ్య, సురేష్ పాల్గొన్నారు.

## మర్రిపాడులో ఎరువుల దుకాణాల తనిఖీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు, మండలం లోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం ఆత్మకూరు సహాయ వ్యవసాయ సంచాలకులు శైలజ కుమారి, ఉదయగిరి మండల వ్యవసాయ అధికారి విజయభాస్కర్లు తనిఖీ చేశారు. ఆ దుకాణాల్లోని రిజిస్టర్ లను పరిశీలించారు. ఎక్కువ ధరలకు ఎరువులను విక్రయిస్తే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ఎమ్మార్పీ ధరలకే అమ్మాలని సూచించారు. అంతేకాకుండా ఆ ధరలను పట్టికలో అందరికీ కనిపించే విధంగా ఉండాలని తెలిపారు. వారి వెంట మండల వ్యవసాయ అధికారి కవిత కూడా ఉన్నారు.

# పోలీసులకు పని పెట్టిన వినాయక చవితి ఉత్సవాలు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** వినాయక చవితి ఉత్సవాలు ఈ సంవత్సరం తిమ్మసముద్రం గ్రామంలో పోలీసులకు పని కల్పించాయి. అటు అధికార పార్టీ, ఇటు పాత కమిటీ తోపాటు వైసీపీ నేతల మధ్య వినాయక విగ్రహ ఏర్పాటు స్థల నిర్ణయంలో కొంత వివాదం నెలకొంది. ఇరువర్గాల మధ్య ఎస్ఐ సయోధ్యకు ప్రయత్నించిన విఫలమవడంతో, చివరకు సీఐ వెంకటనారాయణ రావాల్సి వచ్చింది. సోమవారం తిమ్మసముద్రం గ్రామానికి వచ్చిన సీఐ ఇరువు వర్గాలను కూర్చోబెట్టి మాట్లాడారు. పాత కమిటీ వాళ్లు దేవాలయం వద్ద స్థలం మాకు ఇవ్వాలని, టిడిపి నేతలు ఆ స్థలాన్ని ఇవ్వాలంటూ పట్టుబట్టారు. ఈ క్రమంలో కొందరు మహిళలు ఎమ్మెల్యే తమను ఇక్కడ వినాయక విగ్రహం పెట్టుకుని ఉత్సవాలు జరుపుకోవాలని అనడంతో, వైసిపి సర్పంచ్ రావిప్రసాద్ నాయుడు తో పాటు పాత కమిటీ సభ్యులు అలా అయితే మీరే వినాయక చవితిని జరుపుకొండి అంటూ వెనుతిరిగారు. విగ్రహాన్ని కూడా మీరే తీసుకెళ్లాలంటూ పోలీసులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రావి ప్రసాద్




నాయుడు మాట్లాడుతూ.. వివాదాలకు తావు ఉండకూడదనే ఉద్దేశంతోనే తాము వినాయక చవితిని విరమించుకుంటున్నామని తెలిపారు. తెలుగుదేశం పార్టీ రాకతో పాత పద్ధతులు గాలిలో కలిసిపోయాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని రైతుల ఆందోళన




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విధానాన్ని రద్దు చేయాలని సిపిఎం, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని లింగం లేనిపల్లెలో రైతులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ పంప్ సెట్ల మోటర్లకు మీటర్లు పెట్టే విధానం రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని అన్ని రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న మన రాష్ట్రం అమలు చేయడం దారుణంగా ఉందన్నారు. ఈ విధానం ద్వారా విద్యుత్ బిల్లు అధిక మొత్తంలో వస్తాయన్నారు. ఫలితంగా రైతులు ఇక్కట్లు పడతారన్నారు. ఎన్నికలకు ముందు మంత్రి లోకేష్ బాబు స్మార్ట్ మీటర్లను పగలగొట్టమని చెప్పారని గుర్తు చేశారు. ఆదాని కంపెనీకి లాభం చేకూర్చే విధంగా ప్రభుత్వం, పాలకులు వ్యవహరిస్తున్న రన్నారు. ప్రతి ఒక్కరూ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు. ప్రభుత్వం పునరాలో చించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైతులందరికీ సరిపడా యూరియాను ప్రభుత్వం అందించి మార్క్ఫెడ్ ద్వారా రైతులకు సరఫరా చేయాలన్నారు. యూరియా అందుబాటులో లేక ఇప్పటికే అనేకమంది రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్ల విధానం రద్దు, యూరియా సరఫరా చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో రైతుల పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

**జలదంకి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు కేశవరం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మాజీ సర్పంచి గద్దె బ్రహ్మయ్య యాదవ్ ప్రారంభించి లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందించడం జరిగింది. ఈ సందర్భంగా గద్దే బ్రహ్మయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలకు మరింత పారదర్శకంగా, అవినీతి రహితంగా రేషన్ సరకులు అందించేందుకు ఏటీఎం కార్డు తరహాలో రాజముద్రతో పాటు లబ్ధిదారు చిత్రం ఉన్న ఆధునిక స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం రూపొందించిందని తెలిపారు. ఇందులోని ప్రత్యేకత క్యూఆర్ కోడ్ దీన్ని స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు, ఈకేవైసీ స్థితి, రేషన్ సరకుల వివరాలు, కేటాయించిన పరిమాణం, రేషన్ పొందిన స్థితి, డిపో వివరాలు అన్నీ తక్షణం తెలుసుకోవచ్చని తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా రేషన్ పొందే సదుపాయం కూడా కల్పించారన్నారు. ప్రజా సంక్షేమం కోసం టెక్నాలజీని వినియోగిస్తున్న తొలి ముఖ్యమంత్రి నారా



చంద్రబాబు నాయుడు దూరదృష్టి వల్లే ఈ స్మార్ట్ రేషన్ కార్డులు సాధ్యమయ్యాయని కూటమి ప్రభుత్వం, ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం కొనసాగిస్తుందన్నారు. పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు.

## నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** గణేశ్వరాపురం, తూర్పు రొంపిదొడ్ల గ్రామాలకు 24గంటల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను నూతనంగా ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏడి కృష్ణారెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఏడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. గణేశ్వరాపురం, తూర్పు రొంపిదొడ్ల గ్రామాలలో గత ట్రాన్స్ ఫారంపై ఓవర్ లోడ్ రావడంతో పలురకాల విద్యుత్ సమస్యలు ఏర్పడ్డాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయడంతో వారు వెంటనే ఈ ప్రాంతంలకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా 24గంటల విద్యుత్ వసతి కల్పించటం జరిగిందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ యువ నాయకులు పేరం సుధాకర్ రెడ్డి, కాంట్రాక్టర్ త్రినాద్ రెడ్డి, లైన్‌మెన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ముత్తుకూరు ఎస్ఐగా కే.ప్రసాద్ రెడ్డి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్‌గా కె.ప్రసాద్ రెడ్డి నియామకం కావడం జరిగింది. అనంతరం పోలీస్ స్టేషన్ నందు ఎస్ఐని కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. నెల్లూరు రూరల్ మండలం నుంచి ఇక్కడికి వచ్చినట్లు తెలియజేశారు. ముందస్తుగా మండల ప్రజలకు వినాయక చవితి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చవితి వేడుకలు చక్కగా జరుపుకోవాలని ఎలాంటి వివాదాలు లేకుండా చూసుకోవాలని ఉత్సవ కమిటీలు బాధ్యత వహించాలన్నారు. పోలీస్ శాఖ నుండి ఆన్‌లైన్ ద్వారా అనుమతులు తీసుకున్న తర్వాతే వినాయక చవితి వేడుకలు జరుపుకోవాలని అన్నారు. అశ్లీల నృత్యాలు, డిజె సౌండ్ సిస్టం ఏర్పాటు చేయకూడదని ఎస్ఐ అన్నారు. విధి నిర్వహణలో కఠినంగా వ్యవహరిస్తామని శాంతి భద్రతలు పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తామని ఈ సందర్భంగా ఎస్ఐ మీడియాతో చెప్పడం జరిగింది. ప్రజలు సహకారం అందించాలన్నారు.

## ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి అభినందనలు




**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** సీతారామపురం మండలం మారంరెడ్డి పల్లి నూతన సొసైటీ చైర్మన్‌గా ఎన్నికైన సోమనబోయిన రాజశేఖర్, డైరెక్టర్లు గొల్లపల్లి భాస్కర్, రఘురాములు సోమవారం వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయం నందు ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుత్యం అందించి శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సోమనబోయిన రాజశేఖర్, గొల్లపల్లి భాస్కర్, రఘురాములు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కాకుల సురేష్ మాపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతను వమ్ము చేయక వన్నె తెస్తామని, రైతులకు అండగా ఉంటూ, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతారామపురం మండల కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## వైఎస్ఆర్ విగ్రహాలు ముస్తాబు




**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** దివంగత నేత ప్రియతమ నాయకులు పేద ప్రజల పెన్నిధి ఆంధ్ర రాష్ట్రంలో ఎవరు ప్రవేశపెట్ట లేనన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన నేత స్వర్గీయ డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి అంటే ఈ రాష్ట్రంలో ఉన్న అందరికీ ప్రత్యేకమైనటువంటి అభిమానం గౌరవం ప్రేమ ఉంది. అదేవిధంగా డాక్టర్ వైయస్సార్ పైన ఉండే ప్రేమ అభిమానం గౌరవంతో ఉదయగిరి వైయస్సార్సీపి మండల కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి ఉదయగిరి మండలంలో ఉన్న డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గారి దాదాపుగా 27 విగ్రహాలను సెప్టెంబర్ రెండవ తేదీ వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా అన్ని విగ్రహాలకు సొంత నిధులతో పెయింటింగ్ వేయించాలని నిర్ణయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయగిరి మండలంలోని గంగుల వారి అయ్యవారిపల్లి, దేకురుపల్లి గ్రామాలలోని వైయస్సార్ విగ్రహాలకు పెయింటింగ్ చేయడం జరిగింది. వైయస్సార్ వర్ధంతి లోగా మిగతా విగ్రహాలను కూడా పెయింటింగ్ వేసి సిద్ధం చేస్తారని ఈ సందర్భంగా కొండ రాజగోపాల్ రెడ్డి తెలియజేశారు.

## విద్యార్థులకు యోగపై అవగాహన కల్పించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విద్యార్థి దశ నుంచే విద్యార్థుల కు యోగా పై అవగాహన కల్పించాలని ఎంఈఓ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం దుర్గంపల్లి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రార్థన సమయం కంటే ముందుగా పాఠశాల చేరుకొని ప్రార్థనలో పాల్గొని విద్యార్థులకు నీతి సూక్తులను వర్ణించారు. తదుపరి పాఠశాలలో ప్రతిరోజు జరిగే యోగా కార్యక్రమంలో పాల్గొని స్వయంగా యోగాసనాలను వేసి విద్యార్థులకు యోగ యొక్క విశిష్టతను తెలియజేశారు. అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్యాలను పరిశీలిస్తూ విద్యార్థుల యొక్క సంగ్రహణ శక్తి బాగుందని ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల యొక్క అన్ని రికార్డులను పరిశీలిస్తూ రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేటెడ్‌గా ఉంచాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ హజరత్ ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# స్మార్ట్ కార్డుల పంపిణీ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ముద్రించిన స్మార్ట్ రేషన్ కార్డులను మండల తెలుగుదేశం పార్టీ నేతలు లబ్ధిదారులకు రేషన్ డీలర్ల సచివాలయ సిబ్బంది సమక్షంలో కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గూడా నరసారెడ్డిసొసైటీ చైర్మన్ చల్ల వెంకటేశ్వర్లు యాదవ్ మాట్లాడుతూ.. ఎంతోకాలంగా ఎంతో కాలంగా రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ కార్డుల రూపంలో కొత్త కార్డులను అందజేసింది అన్నారు. కార్డుల్లో మార్పులు చేర్పులు వేసుకొని కొత్త కార్డుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు ఈ కార్డులో పూర్తి సమాచారంతో కార్డులను అందజేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో కారుల కోసం దరఖాస్తు చేసుకున్న ఫలితం లేదని కనీసం కార్డుల మార్పులు చేర్పులు కూడా జరగలేదని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం మార్పులు చేర్పులతో ఆధునిక సాంకేతికతో రూపుదిద్దుకున్న స్మార్ట్ కార్డులతో బయోమెట్రిక్ డేటా క్యూఆర్ కోడ్ వంటి ప్రత్యేకతలు ఉన్నాయన్నారు ఎక్కడి నుంచైనా సులభంగా రేషన్ సరుకులు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఏటీఎం కార్డు సైజులో క్యూఆర్ కోడ్‌తో స్మార్ట్ రేషన్ కార్డులు ప్రభుత్వం ఇవ్వడంతో ప్రజలు కూడా సంతోషిస్తున్నారని తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు డీలర్ల ద్వారా లబ్ధిదారులకు రెవెన్యూ సచివాలయ సిబ్బంది ఒకటో తేదీ వరకు కార్డులను పంపిణీ చేస్తారన్నారు. ఒకటవ తేదీ నుండి రేషన్ పంపిణీ మొదలవుతుందని ఈపాస్ మిషన్ ద్వారా కార్డుదారు వేలిముద్ర తీసుకొని ఆన్లైన్ పద్ధతిలో స్మార్ట్ కార్డులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఇంకెవరైనా మార్పులు చేర్పులు చేసుకోవాలన్న ప్రభుత్వం వచ్చే నెల నుండి అవకాశం కల్పించిందని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ నేతలను స్మార్ట్ కార్డుల పంపిణీలో పాల్గొని ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోసొసైటీ డైరెక్టర్లు కోడూరు నాగిరెడ్డి గని శ్రీనివాసులు మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య సర్పంచ్ నల్లగొండ సుజనా మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావు ఎమ్మెస్ నాయుడు షేక్ బాదుల్లా చేబ్రోలు వసంతరావు ఏగినేని శ్రీనివాసులు ఎన్.రాయుడు గురిజాల వాసు నాయుడు సుబ్బరాయుడు షేక్ అబ్దుల్లా చెరుకూరి వెంకటేశ్వర్లు జానాపురం కృష్ణ మారెళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

## మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** కూటమి ప్రభుత్వం రేషన్ పంపిణీ మరింత పారదర్శంగా జవాబుదారీతనంగా నిర్వహించాలని లక్ష్యంతో పాత కార్డులు స్థానంలో రాజముద్రతో ఏటీఎం కార్డు సైజులో ముద్రించి క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమని మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ప్రభుత్వం క్రొత్తగా ఏర్పాటు చేసిన క్యూ ఆర్ కోడ్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని వరికుంటపాడు 22 రేషన్ డిపో పరిధిలోని ఎస్సీ కాలనీలో తాసిల్దార్ పసుపులేటి హేమంత్ కుమార్, ఎంపీడీవో గోపి శ్రీనివాస్, జెడ్పిటిసి రావెళ్ల నాగేంద్ర,మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు, సొసైటీ అధ్యక్షులు గుర్రం గోపి,గ్రామ పార్టీ అధ్యక్షులు పొద మాధవరావు లు ప్రారంభించారు. అనంతరం లబ్దిదారులకు పంపిణీ చేశారు. అలాగే పంచాయతీ పరిధిలోని కనియంపాడు గ్రామంలో మండల ప్రధాన కార్యదర్శి పోలిబోయిన శ్రీకాంత్ యాదవ్, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి క్యు ఆర్ కోడ్ రైస్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తాసిల్దార్ పసుపులేటి హేమంత్ కుమార్ మాట్లాడుతూ లబ్దిదారులకు ఉపయోగపడేవిధంగా కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం అందజేస్తోందని తెలిపారు. ఈ కార్డులో ఆ కుటుంబ సభ్యుల వివరాలన్నీ క్రోడీకరించి ఉంటాయని, రేషన్ డిపోల్లో వద్ద స్కాన్ చేసిన వెంటనే వివరాలన్నీ తెలుస్తాయని అన్నారు. ఏటీఎం కార్డు సైజుగా ఉన్న కార్డులు అందరు ఉపయేగించుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు చంద్ర మధుసూదన్ రావు మాట్లాడుతూ.. రాజముద్రతో ఏటీఎం కార్డు సైజులో ముద్రించి క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్ కార్డులను అందుబాటులోకి తీసుకు రావడం దేశంలోనే ఎన్నడు లేని విధంగా క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని కొనియాడారు. ఎన్నికల హామీలలో ఇచ్చిన మాట ప్రకారం పాత కార్డులను తొలగించి, క్యూఆర్ కోడ్ కలిగిన కొత్త రేషన్ కార్డులు అమలు చేయడం ద్వారా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. లబ్దిదారులకు పారదర్సకతో మరింత మెరుగైన సేవలందించాడానికి కూటమి ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ టు దేవన బోయిన మధు, అంద్రా బాల గురవారెడ్డి, అంద్రా శివరామిరెడ్డి మాలకొండ రాయుడు, కామేపల్లి వెంకటరత్నం, చంచల బోజ్జయ్య, చంచల దిలీప్ కుమార్, పేరయ్య, రాధాకృష్ణ, కామేపల్లి శ్రీనివాసులు, వెంకటరత్నం, ఆవుల అరుణ, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# సేంద్రీయ ఎరువుల వాడకంతోనే ఆరోగ్యం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలను ఉపాధి హామీ పథకం ఏపీవో వెంకటనారాయణ, వెలుగు ఏపీఎం బుజ్జమ్మ, ఖాదర్పూర్ ఐసీఆర్పి నవ్య, బ్రాహ్మణపల్లి వెంకట సుధా ఆధ్వర్యంలో తోటకూర పాలకూర, గోగాకు, వంకాయలు చిక్కుడుకాయలు సోమవారం అమ్మడం జరిగింది. ఈ సందర్భంగా, ఉపాధి హామీ పథకం ఏపీవో వెంకటనారాయణ మాట్లాడుతూ పకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు తినడం మన ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ఈ రోజుల్లో విపరీతమైన రసాయ ఎరువులతో పండించిన పంటలు తిని మన ఆరోగ్యాన్ని అనారోగ్యం బారిన పడుతున్నాం. దీన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఒక సుదీర్ఘ ఆలోచనతో సేంద్రీయ వ్యవసాయంతో పంటలు పండించి తినడం వల్ల మన ఆరోగ్యం కొంతమేరైనా కాపాడుకోవచ్చని తెలిపారు. వెలుగు ఏపీఎం బుజ్జమ్మ మాట్లాడుతూ.. పకృతి వ్యవసాయంలో పండించిన కూరగాయలు తినడం వల్ల మన ఆరోగ్యం మన చేతుల్లో ఉందని తెలిపారు. అంతేకాకుండా మీరు కూడా ప్రతి ఒక్కరు మీ ఇల్లు ఆవరణంలో కాళీ ప్రదేశం ఉంటే కూరగాయ విత్తనాలు గోగాకు, తోటకూర పాలకూర పెంచుకుంటే మంచి ఆహారాన్ని పొందచ్చని డబ్బులు ఆదా చేయొచ్చని, అలాగే ప్రతి సోమవారం పకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు మర్రిపాడు పలు ప్రభుత్వ కార్యాలయంలో పకృతి వ్యవసాయ సిబ్బందిలు కూరగాయలు తీసుకొని వస్తారని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అలాగే గత సోమవారం కొన్ని కూరగాయలు మేము తీసుకెళ్లడం జరిగింది. దుకాణంలో కూరగాయలకి పకృతి వ్యవసాయం పండించిన కూరగాయలకి తేడా ఉందని రుచికరంగా ఉందని ఈ విధంగా మనం ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పకృతి వ్యవసాయం సిబ్బంది వెలుగు, ఉపాధి హామీ పథకం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పార్లపల్లిలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు మండలంలోని పార్లపల్లి గ్రామంలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు యువత మండలాధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. సరుకులు పొందిన, పొందని వారి వివరాలు ఎప్పటికప్పుడు అప్డేటెడ్‌గా కనిపించేలా క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి వచ్చాయని తెలియజేశారు. అలాగే రేషన్ పంపిణీ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న లోపాలను సరిదిద్దేందుకు ఈ స్మార్ట్ కార్డులు దోహదం చేస్తాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు సౌకర్యవంతంగా అనేక మార్పులు తీసుకో రావడం జరిగిందని తెలియజేశారు.అలాగే 65 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులకు నేరుగా ఇళ్ల వద్దకే సరుకులు ఇచ్చే ఏర్పాటు చేసిందన్నారు. అలాగే ఒకటో తేదీకి ఐదు రోజుల ముందే వారికి సరుకులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావుల వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రమేష్ గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కాకర్లకి కృతజ్ఞతలు : సొసైటీ చైర్మన్, డైరెక్టర్లు




**కలిగిరి/వింజమూరు, మేజర్‌న్యూస్ :** కలిగిరి మండలం కుడుములదిన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా భాసం నరసింహ నాయుడు నూతనంగా ఎంపికయ్యారు. ఆ పదవి రావడానికి సహాయ సహకారాలు అందించిన ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కి కృతజ్ఞతలు తెలిపేందుకు సోమవారం వింజమూరులోని తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయానికి చేరుకొని ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన వెంట సొసైటీ డైరెక్టర్లుగా ఎంపికైన డబ్బుగుంట మాల కొండయ్య, మార్తుల మాలకొండారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

## రాష్ట్ర బీజేపీ నాయకులను కలిసిన కంది, బోగాల



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రకటించిన తాజా నియామకాలలో నెల్లూరు జిల్లా నుండి రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా పుట్టేటి సురేందర్ రెడ్డి, రాష్ట్ర జాయింట్ ట్రెజరర్‌గా కంధుకూరి సత్యనారాయణలు నియమితులైన సందర్భంలో వారిని సోమవారం ఆత్మకూరు నియోజకవర్గ కన్వీనర్ కంధి మల్లికార్జున రెడ్డి, మర్రిపాడు మండల బీజేపీ అధ్యక్షుడు బోగల మురళిరెడ్డి, జనరల్ సెక్రటరీ సద్దా రమేశ్‌రెడ్డి కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాలు కప్పి ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో నెల్లూరు జిల్లా నాయకులకు లభించిన కీలక పదవులు పార్టీ బలోపేతానికి దోహదపడతాయని, గ్రామ గ్రామానికీ బీజేపీ సిద్ధాంతాలను చేర్చడంలో అందరూ సమష్టిగా కృషి చేస్తారని తెలిపారు.

# స్మార్ట్ కార్డులతో రేషన్ సరుకుల పంపిణీలో పారదర్శకత

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల ప్రక్రియతోనే పారదర్శకత ఉంటుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తాసిల్దార్ కార్యాలయం వద్ద స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాన్ని తన చేతుల మీదగా ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు వంశీధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు బోలి గర్ల శ్రీనివాస్ యాదవ్, అధికారులు, అన్ని గ్రామాల నాయకులు హాజరు అయ్యారు. వీరితోపాటు జిల్లా సివిల్ సప్లై అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడారు. క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ఈరోజు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించుకున్నాం అన్నారు. సరుకులు పొందిన, పొందని వారి వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేటెడ్‌గా కనిపించేలా క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి వచ్చినట్లు సోమిరెడ్డి వెల్లడించారు. రేషన్ పంపిణీ వ్యవస్థలో చోటు చేసుకుంటున్న లోపాలను సరిదిద్దేందుకు ఈ స్మార్ట్ కార్డులు దోహదం చేస్తాయని శాసనసభ్యులు సోమిరెడ్డి ఈ సందర్భంగా చెప్పడం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు సౌకర్యవంతంగా అనేక మార్పులు తీసుకొస్తోందన్నారు. గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే సరుకులు అంటూ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి వాహనాలను తెచ్చారని ఆ వాహనాలు వచ్చిన సమయంలోనే రేషన్ సరుకులు తీసుకోవాలని ఆ వాహనాలు సక్రమంగా ఇంటి వద్దకు వచ్చేవి కాదన్నారు. దీంతో లబ్ధిదారులు రేషన్ సరుకులు కోల్పోయే అవకాశం ఉండేదని ఎమ్మెల్యే సోమిరెడ్డి విమర్శించారు. కూటమి ప్రభుత్వం రేషన్ వ్యవస్థలో పాత విధానాన్ని అమలులోకి తెచ్చిందన్నారు. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులు ఏ రోజైనా రేషన్ షాపుకి వెళ్లి సరుకులు పొందవచ్చు అని ఎమ్మెల్యే తెలిపారు. 65 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులకు నేరుగా ఇళ్ల వద్దకే సరుకులే ఇచ్చే ఏర్పాటు చేసామన్నారు .ఒకటో తేదీకి ఐదు రోజుల ముందే వారికి సరుకులు ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. మొదట రేషన్ కార్డు వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చిన ఏకైక ప్రభుత్వం టిడిపి ప్రభుత్వం అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పేదల ప్రయోజనాల కన్నా పాలకుల ఫొటోలకే ప్రాధాన్యమిచ్చారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం తెలుగుదేశం ప్రభుత్వం కేవలం లబ్ధిదారుల ఫొటోలతోనే స్మార్ట్ రేషన్ కార్డులు ఇస్తుందన్న విషయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ మోపూర్‌లో కొత్త స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూర్ గ్రామంలో క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అలాగే సరుకులు పొందిన, పొందని వారి వివరాలు ఎప్పటికప్పుడు అప్ డేటెడ్‌గా కనిపించేలా క్యూఆర్ కోడ్ స్మార్ట్ రేషన్ కార్డులు అందుబాటులోకి వచ్చాయని తెలియజేశారు. అలాగే రేషన్ పంపిణీ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న లోపాలను సరిదిద్దేందుకు ఈ స్మార్ట్ కార్డులు దోహదం చేస్తాయే తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలకు సౌకర్యవంతంగా అనేక మార్పులు తీసుకో రావడం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా ప్రతినెల 1వ తేదీ నుంచి 15వతేదీ వరకు లబ్ధిదారులు ఏ రోజైనా రేషన్ షాపుకి వెళ్లి సరుకులు తీసుకోవచ్చునని తెలియజేశారు. అలాగే 65 ఏళ్ల పైబడిన వారు, దివ్యాంగులకు నేరుగా ఇళ్ల వద్దకే సరుకులే ఇచ్చే ఏర్పాటు చేసింది. అలాగే ఒకటో తేదీకి ఐదు రోజుల ముందే వారికి సరుకులు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ చైర్మన్ పముజుల ప్రదీప్, కనుపూర్ కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తుళ్లూరు రామయ్య, టిడిపి సీనియర్ నాయకుడు సౌత్ మోపూర్ గ్రామ టిడిపి అధ్యక్షుడు అన్నం సుధాకర్ గౌడ్, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా పీఏసీఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలంలోని నాగులవరం పిఏసిఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం చెంచులక్ష్మీపురం గ్రామంలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి హాజరై, ప్రమాణ స్వీకార సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగులవరం పిఏసిఎస్ నూతన అధ్యక్షుడిగా చిలకపాటి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లుగా లక్కాకుల మాధవరావు, వాయిల సుధా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయమే అసలైన సాయం అన్నారు. వ్యవసాయమే దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రాణం అని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు పిఏసిఎస్ లు కీలకంగా నిలవాలని చెప్పారు. రైల్వే ట్రాక్ దాకా వ్యాపించిన వ్యవసాయ పొలాల నుంచి నేషనల్ హైవే దాకా వివిధ ప్రాంతాల ప్రతినిధులను ఎంపిక చేయడం వెనుక సంకల్పం ఉందన్నారు. చిలకపాటి వెంకటేశ్వర్లు తరచూ బోగోలులో ఉండటం వల్ల అనుసంధాన బాధ్యతలు సమర్థంగా నిర్వహించ గలరని అన్నారు. మాధవరావు, సుధాకర్ నియామకాలు కూడా ప్రాంతీయ సమతుల్యత దృష్టిలో పెట్టుకొని తీసుకున్న నిర్ణయాలేనని తెలిపారు. డిఎం ఛానల్ అసంపూర్ణత రైతాంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తోందని, 1994లో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ ఇప్పటికీ పూర్తి కాకపోవడాన్ని పాలకుల నిర్లక్ష్యంగా అభివర్ణించారు. అక్టోబర్ నాటికి డిఆర్ ఛానల్ ద్వారా నీరు విడుదల చేయాలని ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. కనిగిరి రిజర్వాయర్ నుంచి నీటి వనరులు తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధమవుతున్నదని పేర్కొన్నారు. బోగోలు లో 824 ఎకరాల రైల్వే భూమిలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేసే పథకానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే ఢిల్లీకి ఫైల్ పంపినట్లు వెల్లడించారు. ఈ పార్క్ ద్వారా దాదాపు 10వేల ఉద్యోగాలు లభించే అవకాశముందని అన్నారు. వివిధ పోర్టుల (కృష్ణపట్నం, రామాయపట్నం) సమీపంలో ఉండటంతో ఈ పార్క్ వ్యాపారిక లాజిస్టిక్స్‌కు కేంద్రంగా మారనుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లల విద్య కోసం కేంద్ర విద్యాలయం ఏర్పాటుకు ఇప్పటికే స్థల సర్వే పూర్తయిందని వెల్లడించారు. అంతేగాక, పిహెచ్సీని బోగోలులో ఏర్పాటు చేయడానికి బొచ్చు కృష్ణకుమార్ స్వచ్ఛందంగా నిధులు ఇవ్వనున్నారని, భవనం కోసం ఇప్పటికే భూమిని కేటాయించి హ్యాండ్ ఓవర్ చేశామని తెలిపారు. రైతులు డూప్లికేట్ పెస్టిసైడ్స్ వాడకూడదని, సొసైటీల ద్వారా నేరుగా కంపెనీలతో ఒప్పందాలు చేసి రైతులకు అసలైన ఉత్పత్తులు తక్కువ ధరకు అందించనున్నట్లు తెలిపారు. యూరియాను బ్లాక్ మార్కెట్ లో విక్రయిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. రైతులు అవసరానికి మించి యూరియాను వాడడం వల్ల నైట్రోజన్ డోసు పెరిగి, పంట నాశనం అవుతోందని తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య పరిష్కారానికి రూ.42లక్షల నిధులతో పథకం చేపట్టినట్లు తెలిపారు. గౌరవరం గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకొని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇది విజయవంతమైతే ఇతర గ్రామాల్లోనూ అమలు చేస్తామన్నారు. నాకు ఈ మండలం మీదున్న అభిమానం వర్ణనాతీతం అన్నారు. రాజకీయాల్లోకి వచ్చిన తన లక్ష్యం ప్రజాసేవ మాత్రమేనని స్పష్టం చేశారు. నాయకుడిగా కాదు, సేవకుడిగా ప్రజల అండగా ఉండాలని తన తుదిసంకల్పంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాలేపాటి నాగేశ్వరరావు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళా సంఘాల నాయకులు, అధికారులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నేటి దినపత్రిక సూర్య
విలేకర్లు కావలెను
తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9000483583


## మెప్మా డైరెక్టర్‌గా పెంచలయ్య



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** మెప్మాలో పనిచేస్తున్న సిబ్బందిలో సీనియారిటీ ఆధారంగా శ్రీకాకుళం జిల్లా, మన్యెం జిల్లా, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలకు ప్రాజెక్టు డైరెక్టర్‌లను మెప్మా మిషన్ డైరెక్టర్ ప్రభుత్వ ఆదేశాను సారం ప్రకటించగా అందులో మన నెల్లూరీయుడు దర్శిగుంట పెంచలయ్యకు డాక్టర్ బిఆర్ అంంబెద్కర్ కోనసీమ జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా పెంచలయ్య, జిల్లా కలెక్టర్ రావులాల మహేష్ కుమార్‌ని కలసి ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా జాయిన్ అవడం జరిగింది. అనంతరం వారి సిబ్బంది పెంచలయ్యను ఘనంగా సన్మానించారు.

## భారత యుద్ధనౌక ఉదయగిరి జల ప్రవేశం నేడే



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** వికసిత భారత్‌లో భాగంగా ఉదయగిరి పేరుతో ఒక యుద్ధనౌక మంగళవారం హిందూ మహాసముద్ర జలాల్లో ప్రవేశ పెట్టేందుకు రంగం సిద్ధమైంది. మహోన్నత గిరులతో శత్రుదుర్భేద్యంగా ఉన్న ఉదయగిరి చారిత్రక దుర్గానికి గౌరవ చిహ్నంగా ఐఎన్ఎస్ ఉదయగిరి పేరుతో ఈ యుద్ధ నౌకను సిద్ధపర్చారు. ముంబైకి చెందిన ఎండిఎస్ఎల్ కంపెనీ ఎఫ్-35 ఉదయగిరి నౌకను రూపొందించింది. అధునాతన సాంకేతికతో శత్రుదుర్భేద్యంగా నిర్మించిన ఈ యుద్ధనౌక నుంచి 40 మిస్సైళ్ళు ప్రయోగించే సామర్థ్యంతో రూపొందించారు. 149 మీటర్ల పొడవుతో డిజైన్లో నిగూడత్వం, సామర్థ్యంలో ఎంతో బలోపేతమైంది. భారత నేవీ దళం డిజైన్ బ్యూరో రూపొందించిన 100వ నౌక ఐఎన్ఎస్ ఉదయగిరి. దీనికోసం భారత ప్రభుత్వం రూ.600 కోట్లు వ్యయపర్చింది. ఈ నౌక జూలై ఒకటిన నిర్మాణం పూర్తిచేసుకోగా విశాఖపట్నం నౌకాదళం అధికారులు మంగళవారం జలప్రవేశం గావించేందుకు ముహూర్తం ఖరారు చేశారు.

**యుడిఎఫ్ హర్షం :** నెల్లూరు జిల్లాలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన ఉదయగిరిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారత అంబుల పొదిలోని యుద్ధ నౌకకు ఉదయగిరి పేరు పెట్టడం అభినందనీయమని ఉదయగిరి డెవలప్మెంట్ ఫోరం హర్షం ప్రకటించింది. శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఘనకీర్తి గాంచిన ఉదయగిరి మళ్లీ భారత దేశ వ్యాప్తంగా మారు మ్రోగనుందని యుడిఎఫ్ ప్రతినిధులు వియస్ఆర్ మూర్తి, ఎండి ఖాజా వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వం ఇకనైనా దిగొచ్చి ఉదయగిరిని పర్యాటక ప్రదేశంగా ప్రకటించాలని వారు కోరారు.

# ఎస్పీ పీజీఆర్ఎస్‌కు 93 ఫిర్యాదులు

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సోమవారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా వ్యాప్తంగా 93 ఫిర్యాదులు అందాయి. ఆత్మకూర్ డీఎస్పీ కె.వేణుగోపాల్ ఫిర్యాదు దారుల నుంచి వినతులు స్వీకరించి, ఫిర్యాదు దారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో చిన్న బజార్ సిఐ కోటేశ్వరరావు, లీగల్ అడ్వైజర్ టి శ్రీనివాస్ రెడ్డి, ఎస్బి-2 సిఐ శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.



▶▶ దర్గామిట్ట పరిధికి చెందిన వ్యక్తి యొక్క కుమారునికి, విజయవాడకు చెందిన పులి శివయ్య అతని సహచర ఉద్యోగులు హరితేజ, అరవింద్ అనే వ్యక్తులు రైల్వే శాఖలో సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు చేస్తున్నట్లు, రైల్వే శాఖలో అటెండర్ జాబ్ ఇప్పిస్తానని నమ్మించి 6 లక్షల రూపాయలు తీసుకొని, జాబు ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారని, అదేవిధంగా వేదాయపాలెం పరిధికి చెందినటువంటి మహిళను, నెల్లూరుకు చెందిన జి.వినోద్ అతని భార్య అరవ సురేఖ అనేవాళ్ళు ప్రభుత్వ హాస్పిటల్‌లో పనిచేస్తున్నట్లు, ప్రభుత్వ శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, ఒక లక్ష నగదు, ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని, జాబ్ ఇప్పించకుండా, ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా, నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

▶▶ లింగసముద్రం పరిధికి చెందినటువంటి వ్యక్తిని, భారత మాట్రిమోనియల్ వెబ్సైట్‌లో గాయత్రి అనే మహిళ పరిచయమై, మలేషియాలోని సిఐఎంబి అనే బ్యాంకులో పని చేస్తున్నట్లు నమ్మించి, ఆగస్టులో వైజాగ్‌కు వస్తానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, గ్లోబల్ ట్రేడ్ అనే సైట్‌లో 12 లక్షలు నగదు పెట్టుబడిగా పెట్టించి, తరువాత తన నంబర్లు అన్ని బ్లాక్ చేసిందని, ఫోన్లోనూ రెస్పాండ్ కావట్లేదని, మోసపోయానని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

▶▶ వేదాయపాలెం పరిధికి చెందినటువంటి వ్యక్తిని, బాలాజీ నగర్ పరిధికి చెందిన బోగోలు రమేష్ అనే వ్యక్తి బ్యాంకులో లోన్ ఇప్పిస్తానని నమ్మించి, 5,67,000/- లక్షల నగదు తీసుకొని, లోను ఇప్పించకుండా నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నాడని, అడిగితే బెదిరిస్తున్నాడని అంతేకాకుండా తన మీదే తప్పుడు రిపోర్టు ఇచ్చినట్లు, విచారించి న్యాయం చేయాలని కోరారు.

▶▶ కలువాయి పరిధికి చెందినటువంటి వృద్ధురాలిని తన మూడవ కుమారుడైన వెంకటేశ్వర్లు తన పేరు మీద ఉన్న ఆస్తి మొత్తం తన మీద రాయించి ఇవ్వాలని, తన భార్యతో కలిసి కొట్టి, నగదు లాక్కొని ఇంటి నుండి తరిమేసి, నా ఇంటికి తాళం వేసేసారని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

▶▶ బుచ్చి పరిధికి చెందినటువంటి మహిళను, తన భర్త చెడు వ్యసనాలకు బానిసై శారీరకంగా మానసికంగా వేధిస్తున్నారని, తన అత్త- భర్త కొట్టి గాయపరిచారని, వారిపై చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా బాలాజీ నగర్ పరిధికి చెందినటువంటి మహిళ ప్రేమ వాహనం చేసుకున్నట్లు, ఒక బాబు ఉన్నట్లు, కాన్పుకు పుట్టింటికి వెళ్ళిన తర్వాత నుండి తనను కాపురానికి తీసుకు పోలేదని, విడాకులు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు, తనని తన బిడ్డ బాగోగులు పట్టించుకోకుండా మానసికంగా వేదిస్తున్నట్లు, విచారించి న్యాయం చేయాలని, కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కగా దిద్దాలని కోరారు.

# స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే టీడీపీ లక్ష్యం : పసుపులేటి వికాస్ బాబు



**సీతారాంపురం, మేజర్‌న్యూస్ :** స్మార్ట్ ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణమే టీడీపీ యొక్క ముఖ్య ఉద్దేశమని మండల తెలుగుయువత అధ్యక్షులు సొల్లేటి వికాస్ బాబు తెలిపారు. సోమవారం సీతారాం పురం పరిధిలోని బెస్త కాలనీలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్మిస్తున్న స్మార్ట్ ఆంధ్రప్రదేశ్ స్ఫూర్తితో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్మార్ట్ ఉదయగిరి పేరుతో ఉదయ గిరి నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. ఉదయ గిరి నియోజకవర్గ ప్రజలకు డయాలసిస్ సెంటర్ సేవలను వింజమూరులో నెలకొల్పిన ఘనత ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు దక్కుతుందని తెలి పారు. యువ నాయకులు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆశయాలకు అనుగుణంగా సీతారాంపురం మండలంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి, పారిశ్రామిక, రంగాలలో ముందుకు పోయే విధంగా పలు కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాయి ప్రసాద్, తహసిల్దార్ షేక్ హజిహ, కోటమి నాయకులు తెలుగుదేశం పార్టీ గౌరవాధ్యక్షులు వెంగల్ శెట్టి వెంకటేశ్వర్లు. సింగిల్ విండో చైర్మన్ సోమనబోయిన రాజశేఖర్, ఏనుగుల సుబ్బ రాయుడు, జిల్లా పరిషత్ హై స్కూల్ చైర్మన్ తోట ఏడుకొండలు, మండల జనసేన పార్టీ అధ్యక్షులు భోగినేని కాశీరత్తయ్య గాంధీ. నీటి సంఘం చైర్మన్ నీలి రత్తయ్య, మండల తెలుగు యువత నాయకులు బండి రవి, నాయకులు, సచివా లయ సిబ్బంది రేషన్ షాప్ సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి చొరవతో తాత్కాలిక బయాలజీ సైన్స్ టీచర్ నియామకం

## స్పందన హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు

**చేజర్ల, మేజర్‌న్యూస్ :** చేజర్ల మండలం నాగుల వెల్లటూరు జడ్పీ హైస్కూల్‌లో బయాలజీ సైన్స్ టీచర్ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయం రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి దృష్టికి వెళ్లింది. ఈ సమస్యను పరిష్క రించేందుకు మంత్రి ఆదేశాల మేరకు కిమ్స్ హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాళ్లూరి గిరి నాయుడు సూచనలతో డిప్యూటీ డీఈఓ ఎంవి జానకిరామ్, ఎంఈఓ డీసీ మస్తానయ్య తక్షణమే హైస్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఎస్ఎంసి కమిటీ సభ్యులతో మాట్లాడిన అధికారులు సమస్యను వివరంగా తెలుసుకున్నారు. తాత్కాలికంగా బయాలజీ



సైన్స్ టీచర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటిం చారు. దీంతో విద్యార్థులు ఉపశమనం పొంద గా, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాగులవెల్లటూరు గ్రామ ప్రజలు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, తాళ్లూరి గిరినాయుడుకి, అలాగే సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవ చౌదరికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇంత వేగంగా చర్యలు తీసుకున్నందుకు ప్రజలు అభినందనలు తెలిపారు.

# స్మార్ట్ స్ట్రీట్ బజార్ పనులను వేగవంతం చేయండి

▶ కమిషనర్ వైఓ నందన్



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్య వేక్షణలో భాగంగా సోమవారం మైపాడు రోడ్డు జాఫర్ సాహెబ్ కెనాల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ స్ట్రీట్ బజార్ ప్రాజెక్టు నిర్మాణ పనులను కమిషనర్ వైఓ నందన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కమిషనర్ మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. స్థానిక రంగనాయకులపేట పినాకిని పార్కును కమిషనర్ సందర్శించి పార్కులో అవసరమైన అన్ని వసతులను కల్పించాలని ఆదేశిం చారు. మినీ బైపాస్ ప్రాంతంలో రోడ్డును ఆక్రమిస్తూ నిర్వహిస్తున్న నర్సరీ, వినాయక విగ్రహాల నిర్వాహకులతో కమిషనర్ మాట్లాడి ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, సిటీ ప్లానర్ హిమబిందు, పబ్లిక్ హెల్త్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కార్డులతో రేషన్ పంపిణీలో పారదర్శకత



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** క్యూ ఆర్ బేస్డ్ స్మార్ట్ కార్డులతో రేషన్ పంపిణీలో పారదర్శకత లభిస్తుందని పొదలకూరు పీఏసీఎస్ చైర్మన్ తల చీరు మస్తాన్‌బాబు పేర్కొన్నారు. పాత రేషన్ కార్డ్ స్థానంలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పొదలకూరులో సోమవారం ఆయన ప్రారంభించారు. తహసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావే శంలో లబ్ధిదారులకు నూతన కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా మస్తాన్ బాబు మాట్లాడుతూ ఏటీఎం కార్డు తరహాలో ఉండే ఈ స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రభుత్వ అధికార చిహ్నం, కుటుంబ పెద్ద ఫోటో, క్యూఆర్ కోడ్ కలిగి ఉంటుందన్నారు. క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేస్తే కార్డులోని కుటుంబ సభ్యుల వివరాలు లభ్యమవుతాయన్నారు. కార్డు ద్వారా కుటుంబ సభ్యుల ఈకేవైసీ స్థితిని, రేషన్ కేటాయింపు, రేషన్ తీసుకున్న వివరాలు తెలుసుకోవచ్చన్నారు. ప్రభుత్వం బాధ్యతాయుతంగా ప్రతి లబ్ధిదారునికి వారి ఇంటి వద్దకే రేషన్ కార్డులు చేర్చడం జరుగుతుందన్నారు. పౌరసర పరాల శాఖ డిప్యూటీ తాహసిల్దార్ ఇండ్ల రవి మాట్లాడుతూ.. పొదలకూరు మండలానికి 21వేల స్మార్ట్ రేషన్ కార్డులు వచ్చాయని, వాటిని సచి వాలయ సిబ్బంది ద్వారా 25వ తేదీ నుంచి 31వ తేదీ లోగా వద్దకే చేర్చడం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు ఒకవేళ ఇళ్ల వద్ద లేకపోతే అలాంటి వారి రేషన్ కార్డులను డీలర్ల వద్ద చేరుస్తారని ఒకటో తేదీ నుంచి రేషన్ షాపులు వద్ద తీసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సురేఖ, పట్టణ టిడిపి అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు కోవూరు వెంకటేశ్వర్లు నాయుడు, కండే నరసయ్య, రేషన్ డీలర్లు రాజా పెంచలయ్యలు పాల్గొన్నారు.

# శ్రీ గురప్ప స్వామికి ప్రత్యేక పూజలు

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు నడుమూరు నందు వేంచేసియున్న శ్రీ గురప్ప స్వామి అంకాలమ్మ నాగవరపమ్మ అమ్మవారికి శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. జి.గురవారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి అమ్మవార్లకు ఉదయాన్నే ప్రత్యేక అభిషేకములు జరిపించారు పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని అమ్మవార్లను సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు భక్తులు ఉదయాన్నే ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించి కాయ కర్పూరం చెల్లించి తీర్థ ప్రసాదములు స్వీకరించి పునీతులయ్యారు. కార్యక్రమాలను గురువారెడ్డి పర్యవేక్షించారు.